
ప్రజాశక్తి
మంగళవారం 9 మే 2023
5
పార్వతీపురం మన్యం



స్పందన వినతులకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను అర్జీదారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు వినతులు స్వీకరించారు. స్పందనలో వచ్చిన అర్జీలపై జిల్లా కలెక్టరు వెంటనే సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించిన వినతులపై తహశీల్దార్లతో ఫోనులో మాట్లాడి వివరాలు తెలుసుకొని పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. స్పందన కార్యక్రమంలో అన్నిశాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 86 వినతులు

పార్వతీపురంలో ఏర్పాటైన ఫిష్ ఆంధ్ర షాప్



ఫిష్ ఆంధ్రా తుస్

- షాపుల ఏర్పాటుకు లబ్ధిదారుల నిరాసక్తత
- 68 షాపులు లక్ష్యం... 26 ఏర్పాటు
- ఈ నెలాఖరుకు గడువు పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫిష్ ఆంధ్రా -ఫిట్ ఆంధ్ర పథకం జిల్లాలో తుష్ అయ్యేలా ఉంది. ఫిష్ ఆంధ్రా షాపులు పేరుతో చేపల అమ్మకాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం చాలా చోట్ల నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రాష్ట్రంలో ఫిష్ ఆంధ్ర ఫిట్ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే జిల్లాకు 68 షాపుల ఏర్పాటు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 26 షాపులు మాత్రమే ఏర్పాటయ్యాయి. మిగిలిన షాపుల ప్రారంభానికి ఈనెలాఖరు వరకు అధికార యంత్రాంగం గడువు నిర్దేశించింది. ఈ పథకం లబ్ధిదారులెవరూ షాపుల ఏర్పాటుకు నిరాసక్తత చూపిస్తున్నారు. అధికారులు ఇప్పటికే షాపులు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరిస్తున్నప్పటికీ లబ్ధిదారులెవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ప్రారంభించిన షాపుల్లో పార్వతీపురం డివిజన్లో 10, పాలకొండ డివిజన్లో 16 షాపులు మాత్రమే. ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాట్ల బాధ్యతను మత్స్యశాఖతో పాటుగా మెప్మా, డిఆర్‌డిఎ డిపార్ట్‌మెంట్‌కు కూడా కేటాయించినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ గడువులోగా లక్ష్యం చేరుకోవడం కష్టం లాగానే కనిపిస్తోంది. ఇప్పటికే ప్రారంభించిన షాపుల యజమానులు కూడా ఈ పథకం పట్ల ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం షాపులు ఏర్పాటు చేసుకోమని లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నప్పటికీ మన్యం జిల్లాలో నిత్యం చేపలు అందుబాటులో ఉండకపోవడం, షాపులకు చెల్లించే అద్దెలు కూడా ఎక్కువగా ఉండడంతో లబ్ధిదారులెవరూ ముందుకు రావడం లేదు. ఫిష్ ఆంధ్ర షాపులన్నింటికీ చేపలను సరఫరా చేసేందుకు జిల్లాకు ఒక ఫిష్ హబ్‌ను కోటి రూపాయలతో ఏర్పాటుచేసి, ఆ హబ్ చేపలను నిల్వచేసి ఫిష్ ఆంధ్ర షాపులు అన్నింటికి సరఫరా చేయడం జరుగుతుందని, మొదట్లో చెప్పినప్పటికీ నేటి వరకు ఏర్పాటు కాకపోవడంతో షాపులన్నింటికీ నిరంతరం చేపలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికే ప్రారంభించిన లబ్ధిదారులు అద్దెలు భరించుకోవాల్సి వస్తుంది తప్ప ఈ పథకం వల్ల లబ్ధిదారులకు ఒరిగేదేమీ లేదని తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం

ఫిష్ ఆంధ్రా షాపు ఏర్పాటుపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 26 షాపులను ప్రారంభించాం. మిగిలిన షాపులు కూడా ప్రారంభం కావడానికి వివిధ దశల్లో ఉన్నాయి. ఆసక్తి ఉన్న వారిని మాత్రమే ప్రోత్సహిస్తున్నాం. అయితే ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు.

వేముల తిరుపతయ్య,
జిల్లా మత్స్యశాఖ అధికారి.

ఉద్యోగ,ఉపాధ్యాయుల పట్ల వేధింపులు ఆపాలి

ఏపి అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వేధింపుల ధోరణిని ఆపాలని ఎపి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అమరావతి ఎపిజెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకార్యాచరణ మూడోదశలో భాగంగా సోమవారం జిల్లా కలక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అమరావతి జెఎసి చేస్తున్న డిమాండ్ల పరిష్కారంతో పాటు ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎపిజెఎసి అమరావతి తలపెట్టిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చేపట్టిన మూడవ దశ ఉద్యమ కార్యాచరణ పార్వతీపురం మన్యం జిల్లా వేదికగా ఉధృతం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి శ్రీకాకుళంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించి తదుపరి కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాది పదో తరగతి ఫలితాల్లో కొత్తజిల్లా అయిన పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషితో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిపారని, అంకితభావంతో పనిచేసిన వారిని ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారి తనిఖీల పేరిట, స్వల్ప కారణాలతో విధుల నుంచి తొలగించి, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులను వేధిస్తూ వారితో బోధనేతర పనులు చేయిస్తున్నారని, దీనివల్ల వారి ఆత్మాభిమానం దెబ్బతింటుందని, తద్వారా ఆప్రభావం విద్యార్థుల బోధనపై పడి వారి జీవితాలపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. తమకు రావాల్సిన డిఎలు, తదితర బకాయిలు, ముఖ్యమంత్రి ఎన్నికల ముందు వాగ్ధానం చేసిన సిపిఎస్ రద్దు వంటి న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం గొంతెత్తితే వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1650 అక్రమ పోలీసుకేసులు పెట్టి వారిని వేధిస్తున్నారని అన్నారు. సమస్యలతో సతమతమవుతున్న అన్ని వర్గాలు ఏకమై త్వరలోనే తామేమిటో అన్నది ప్రభుత్వానికి తెలియజేసేలా నిర్వహించే మూడో దశ ఉద్యమ కార్యాచరణకు రాష్ట్రంలోని అన్ని వర్గాలు కలిసి రావాలని, తమకు మద్దతుగా నిలబడాలని కోరారు.

ఉపాధ్యాయులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఉపాధ్యాయులపై అక్రమముగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని మరియు ఉద్యోగపరంగా వారికున్న సమస్యలను పరిష్కరించాలని ఎపిజెఎసి, అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వివిధ ఉపాధ్యాయ సంఘాలు



సమస్యలపై కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న అమరావతి జెఎసి నాయకులు

కలెక్టర్‌కు వినతిని అందజేశారు. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో భాగంగా మన్యం జిల్లా డిఇఒ, జిసిడిఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లను అక్రమంగా సస్పెన్షన్లకు గురి చేశారన్నారు. డిఇఒ, జిసిడిఒలపై సస్పెన్షన్ ఎత్తివేశారని, అలాగే ఎంఇఒ, కెజిబివి స్పెషలాఫీసర్ల సస్పెన్షన్ కూడా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను పాఠాలు బోధించే పనులకు కాకుండా నానా రకాల యాప్‌ల పని భారం కల్పిస్తూ, నాడు-నేడు పనుల పర్యవేక్షణ కూడా ఉపాధ్యాయులకు అప్పగించడం, మరుగుదొడ్ల పరిశుభ్రత, నిర్వహణ పనులతో పాటు పాఠశాల వాచ్మెన్ పని కూడా ఉపాధ్యాయులతో చేయించడం ఎంతో దుర్మార్గమని అన్నారు. ఇటువంటి పనుల వల్ల ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు మానుకొని, నేటి వరకు ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను, అక్రమ సస్పెన్షన్లను మరియు వేధింపులను నిలిపివేయాలని రాష్ట్రంలో గల 26 జిల్లాలలో కలెక్టర్లకు ఎపి జెఎసి అమరావతి వినతి పత్రం అందజేసిందన్నారు. కార్యక్రమంలో ఆసంఘం అసోషియేట్ చైర్మన్ టివి ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామెదరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొట్టాపు శ్రీరామమూర్తి, డిజిప్రసాద్, అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాస రావు, వైస్ చైర్మన్లు జి.చంద్ర మౌళి, ఆర్.రమణమూర్తి, నారాయణరావు, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు ఎన్‌జిఒ అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్, సిఐటియు నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ, విశ్రాంత ఉద్యోగులు అంటిపేట సత్యనారాయణ, గొర్లె అప్పలరాజు, పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిని అడ్డుకుంటున్నారు

సెటిలర్లపై డిప్యూటీ సిఎం ధ్వజం

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన అభివృద్ధి పనులను సెటిలర్లు అడ్డుకుంటున్నారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కొట్టుపరువు గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహులు ఆధ్వర్యాన గిరిజనులు రోడ్డు సమస్య గురించి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెన లు నిర్మిస్తే గిరిజనుల కంటె కమ్మరెడ్డి భూస్వాములకే ఎక్కువ మేలని చెప్పారు. వారు పండించే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా s రోడ్లు ఎక్కువ గా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. పామాయిల్, మొక్కజొన్న,అరటి పంటల రవాణా వల్ల తరచూ రోడ్లు పాడవుతున్నాయని తెలిపారు. పాడైన రోడ్లు బాగు కోసం కనీసం గోతులు కూడా కప్పించే ప్రయత్నం చేయడం లేదన్నారు. గిరిజనుల భూములు కొనుగోలు చేసుకుని వారినే వ్యవసాయ కూలీలుగా ఉపయోగించుకుంటున్న భూస్వాములు అభివృద్ధి పనులు అడ్డుకోవడం దారుణమని అన్నారు. కొట్టుపరువు గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నాలుగు అడుగుల భూమి ఇవ్వమంటే కృష్ణ కిశోర్ అనే భూస్వామి అడ్డుకుంటున్నారని అన్నారు.

స్పందన ఫిర్యాదులపై చర్యలు: ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులపై సత్వరంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బి సిఐఎన్. శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-వీరఘట్టం

రాష్ట్రంలో కెజిబివిల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయ గౌరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రేగులపాడు కెజిబివిని సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కెజిబివిల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. ఉద్యోగ భద్రత, రెగ్యులర్లైజేషన్, మినిమం టైం స్కేల్ పద్ధతిలో జీతాలు చెల్లించేందుకు గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించకపోయినా విద్యార్థులకు మంచి గైడెన్స్ ఇచ్చి చదివించడం వల్లే ఫలితాలు వచ్చాయని న్నారు. ప్రభుత్వము పుస్తకాలు ఆలస్యంగా ఇచ్చినా ఉపాధ్యాయులు అక్కడ ఇక్కడ సంపాదించి సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేశారని అన్నారు. పుస్తకాలు ఇవ్వలేదనే సాకుతో అన్యాయంగా వీరఘట్టం కెజిబివిని ఎస్ఒను సస్పెండ్ చేశారని అన్నారు. పాఠశాల నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఇప్పుడు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఏమంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల వైపు నుండి ఉన్న తప్పిదాలను ఉపాధ్యాయులపై ఆపాదించి అభద్రతకు గురి చేయడం సరికాదని, ఎస్ఒ సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని కోరారు. పాఠశాల చుట్టూ రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు ఐ.రాజమణి, జిల్లా కార్యదర్శి కె.గోవిందమ్మ, ఎం.పైడిరాజు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రగామస్తులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద భోగిల మేజర్ పంచాయతీ పరిధిలో తాగునీరు కోసం అప్పయ్య పేట గ్రామస్తులు సోమవారం జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు అరగంట సేపు జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గడిచిన 15 రోజులుగా గ్రామంలో తాగునీటి సౌకర్యం లేదని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, పండగ రోజుల్లోనూ తాగునీరు సరఫరా చేయకపోతే ఎలా అని భారీ ఎత్తున గ్రామస్తులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ సంఘటనా స్థలం చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడడంతో ఆందోళన విరమించారు. ఎస్సై నీలకంఠ తన సిబ్బంది పంపించి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేతకు కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో భాగంగా సస్పెండయిన వీరఘట్టాం ఎంఇఒ, రేగులపాడు కెజిబివి స్పెషల్ ఆఫీసర్ల సస్పెన్షన్లు ఎత్తి వేయాలని జిల్లా యుఎస్‌పిఎస్ (ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి) ఆధ్యర్యంలో జిల్లా కలెక్టరును సోమవారం కలిశారు. డిఇఒ, జిసిడిఒ సస్పెన్స్ ఎత్తి వేశారని, మిగిలిన వీరిద్దరి సస్పెన్షన్లను కూడా ఎత్తివేయాలని కోరగా, అందుకు కలెక్టరు స్పందిస్తూ వారం రోజులు లోగా సస్పెన్షన్లు ఎత్తి వేస్తామని, ఈ విషయమై ప్రభుత్వంతో మాట్లాడతానని జిల్లా యుఎస్‌పిఎస్ నాయకత్వానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యుఎస్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ కలెక్టరు సానుకూలంగా స్పందించారన్నారు. వారం రోజుల్లోగా సస్పెన్షన్లు ఎత్తివేయకపోతే మరోపోరాటానికి సిద్ధం కావాలని ఉపాధ్యాయ వర్గానికి పిలుపునిస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పిసిహెచ్ శ్రీనివాసరావు, ఎస్.మురళీమోహన్‌రావు, కె.విజయ్, ఎన్.బాలకృష్ణ, శ్రీనివాస్ పట్నాయిక్, సింహాచలం, చంద్రశేఖర్, ఆర్.శ్రీను, జెఎసి చైర్మన్ జి.కిశోర్ ఉన్నారు.

సిహెచ్‌డబ్ల్యూ లకు ఉపాధి పని కల్పించండి

కలెక్టరేట్ : కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు (సిహెచ్‌డబ్ల్యు) ఉపాధి పని కల్పించాలని, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, పార్వతీపురం నుండి కూనేరు వరకు నైట్ హాల్ట్ బస్సు (రాత్రి 9:30)కు వేయాలని కోరుతూ గ్రీవెన్స్‌లో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దీనికి పిఒ స్పందిస్తూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డ్వామా పిడికి చెప్పడం జరిగింది. అలాగే పెండింగ్ జీతాలు కూడా వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నైట్ హాల్ట్ బస్సు కూనేరు వరకు వెళ్లేలా ఆర్టీసీ అధికారులకు కూడా చెప్పడం జరిగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి, వి.ఇందిరా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు దుర్గా, లక్ష్మీ, మౌళి, పార్వతి మంగ, రవణమ్మ, సుజాత పాల్గొన్నారు.

సంత సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో తూరాయిపు వలస వద్ద సోమవారం జరుగుతున్న సంతను కల్పనా కుమారి సందర్శించారు. గిరిజంతో కాసేపు ముచ్చటించారు. సంత నిర్వహించిన తీరును పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ, కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సంత అయిపోయిన తర్వాత ఆ ప్రదేశాన్ని శుభ్రంగా చేసుకోవాలన్నారు. ప్రతి షాప్‌కు ఒక చెత్త కుండీ తప్పనిసరిగా ఉండాలని, వాలంటీర్లతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో కొండపల్లి సత్యం, పంచాయతీ సెక్రటరీ, బి సుదర్శన్ రావు సంత కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 57 వినతులు

సీతంపేట ఐటిడిఎ స్పందన కార్యక్రమం సోమవారం పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమానికి పలు మండలాల నుంచి 57 అర్జీలు వచ్చాయి. కడగండి పంచాయతీకి చెందిన సర్పంచ్ సువార్త తాగునీటి పనుల బిల్లులు మంజూరు చేయాలని కోరారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పిఒ కల్పనకుమారి

తాటిమానుగూడకు చెందిన ఈశ్వరరావు వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరారు. ఈతమానుగూడ చెందిన శ్రీదేవి అంగన్వాడీ పోస్ట్ మంజూరు చేయాలని కోరారు. జజ్జువాకు చెందిన రాజారావు మేకల రుణాలు ఇప్పించాలని విన్నవించారు. ఎగువ ముత్యాలకు చెందిన నరసయ్య రుణం ఇప్పించాలని కోరారు. గాదిలంక చెందిన జీవన్ కుమార్ కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని కోరారు. కోతాంకు చెందిన పార్వతి కిరాణా షాపులోను ఇప్పించాలని కోరారు. బాలిగం చెందిన సోమేశ్ ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. కొత్తూరు చెందిన అప్పలమ్మ తాగునీరు బోరు మంజూరు చేయాలని కోరారు. స్పందనలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మురళి ఎపిఒ రోషిరెడ్డి, ఎడిఎ తిరుమలరెడ్డి, ఎపిడి శ్రీహరి, వెంకటరమణ, జిసిసి డిఎం సంధ్యారాణి, పిఎఒ హరికష్ణ, సిడిపిఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులకు డిఆర్‌డిఎ ద్వారా రుణాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు డిఆర్‌డిఎ ద్వారా అదనపు రుణాలు అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం డివిజను, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వపథకాల లక్ష్యాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హౌసింగు, నరేగా, గ్రామీణ నీటి సరఫరా, రీసర్వే, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్., నాడు-నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు డిఆర్‌డిఎ ద్వారా అదనపు రుణాలు అందించాలని తెలిపారు. జిల్లాకు మంజూరైన ఇళ్లన్ని గ్రౌండింగు చేయాలని, నిర్మాణాలు స్టేజి వారీగా ప్రగతి తీసుకురావాలని తెలిపారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లల వివరాలు, వెల్ఫేర్ అసిస్టెంటు యాప్ నందు నమోదు చేయాలని, ఆధార్ అప్డేషన్ చేయాలని తెలిపారు. ఎన్‌ఆర్ఇజిఎస్ పనులను ఎంపిడిఒ రోజూ పర్యవేక్షించాలని, లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం వచ్చేలా పనులు చేయించాలని అన్నారు. పంచాయతీరాజ్ పనులన్నింటినీ వెంటనే గ్రౌండింగు చేయించాలని, ప్రాధాన్యత భవనాల పనుల్లో జాప్యం ఉండకూడదన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని సిబ్బంది అందరూ వర్చువల్ గా హాజరుకావాలని తెలిపారు. జాయింటు కలెక్టరు సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ సరిహద్దురాళ్ల ప్లాంటేషన్, మ్యుటేషన్లు, భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వికసించిన గిరిజన విద్యా కుసుమాలు

- రాష్ట్రంలో 94శాతం ఉత్తీర్ణతతో మన్యం టాప్
- ఉత్తమ విద్యార్థులను సన్మానించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - సాలూరు

కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా కుసుమాలు వికసించాయి. రాష్ట్రంలోని ఐటిడిఎ అన్నింటిలో మన్యం జిల్లా ఐటిడిఎ పరిధిలో 94శాతం మంది విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలుస్తోంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సాలూరు సహాయ గిరిజన సంక్షేమ అధికారి పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలల్లో 607మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 544మంది ఉత్తీర్ణత సాధించారు. మూడు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత కూడా సాధించారు. మక్కువ మండలం వైఎస్ వలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, పార్వతీపురం మండలం రావికోన, డోకిశిల ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

సాలూరు సహాయ గిరిజన సంక్షేమ అధికారి పరిధిలోని పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను సోమవారం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ సన్మానించారు. తన కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో 552మార్కులు మార్కులు సాధించిన వైఎస్ వలస పాఠశాల విద్యార్థి మర్రి చందు, సాలూరు మండలం మావుడి పాఠశాల విద్యార్థి గెమ్మెల ప్రశాంత్‌కుమార్‌ను ఆయన దుశ్శాలువా లతో సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి పదంలో నడవాలంటే పదో తరగతి పరీక్షలే కొలమానమని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మండలంలో మొదటి స్థానం పొందిన స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల (పిటిజి) పాఠశాలకు చెందిన బిడ్డిక అఖిల (559) ను సోమవారం పార్వతీపురం కలెక్టరేట్లో ఆయన సన్మానించారు. గిరిజన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఉత్తమ అవకాశాలను కల్పిస్తున్నదని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్చార్జి ఎం.రామారావు, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్, పిటిజి గురుకుల బాలికల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, సాలూరు ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

యుటిఎఫ్ అభినందనలు

వీరఘట్టం : పదో తరగతి ఫలితాల్లో స్థానిక కెజిబివి విద్యార్థి కె.రేణుక 572 అత్యధిక



సాలూరు : విద్యార్థి చందును సన్మానిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో పాటు పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భం గా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఎస్ఒ రోహిణి, ఉపాధ్యాయ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, విద్యార్థినిని దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఐ.రాజమణి, జిల్లా కార్యదర్శి కె.గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జెవివి అభినందనలు

కలెక్టరేట్ : పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొట్టమొదటి స్థానంలో నిలపడడం చాలా గర్వంగా ఉందని, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, కష్టపడి చదివిన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎం.రత్న కుమార్, డి.చంద్రమౌళి, ఎండీ ఫరూక్, పి.రంజిత్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన పంచాయితీలు ఎక్కువగా ఉన్నా చదువులో తమకు తిరుగులేని తెలివితేటలు ఉన్నాయని మరోసారి జిల్లా విద్యార్థులు రుజువు చేరారని తెలిపారు. తమ సత్తాను చాటడంతో అద్భుతమైన ప్రతిభను కనపర్చిన విద్యార్థులందరికీ జెవివి జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది.

నీటి వినియోగదారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొత్తవలసలో గల పండిరేగుల చెరువును జైకా నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఎపిఐఎల్ఐపి-2లో భాగంగా నీటి వినియోగదారులు, ఆయకట్టు దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు పండిరేగుల చెరువును పరిశీలించారు. అనంతరం నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎపిడి మురళీకృష్ణ మాట్లాడుతూ రూ.40లక్షల జైకా నిధులతో చెరువు ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయకట్టు రైతులు, నీటి వినియోగదారుల సహకారంతో చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. దీనికి సంబంధించిన సూక్ష్మ ప్రణాళిక రూపొందడానికి సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి,గ్రామ పెద్ద కళ్యాణ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల క్రమ శిక్షణ వివరాలు సత్వరమే పొందుపర్చాలి

పార్వతీపురం: జిల్లా ఉప ఖజానా పరిధిలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమశిక్షణ వివరాలు సత్వరమే హెర్బ్ సైట్‌లో పొందుపరచాలని ఖజానా శాఖ ఉపసంచాలకులు డి.మన్మధరావు శాఖాధికారులను కోరారు. సోమవారం స్థానిక ఎన్జీవో హెూం నందు జిల్లాలోని వివిధ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలో ఉద్యోగులకు సంబంధించిన క్రమశిక్షణ చర్యలన్నీ వివరాలు పొరపాట్లు దొర్లకుండా కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎవరైనా ఉద్యోగి సస్పెండ్ అయ్యి నియామకమైన, కేసులు పెండింగ్‌లో ఉన్నా సంబంధిత వివరాలను సత్వరమే పొందుపరచాలన్నారు. ఉద్యోగి మరణించిన ఎడల అటువంటి వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదన్నారు. పదవీ విరమణ అయినప్పటికీ కేసు పరిష్కారం కాకపోతే ఆయా వివరాలు నమోదు చేయాలన్నారు. ఇకపైనె నమోదులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. 020 వేజస్ కింద జీత భత్యా లు పొందుతున్న సిబ్బంది వివరాలు నమోదు చేయాలన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

విద్యార్థినులకు కలెక్టర్ అభినందన

పార్వతీపురం : పదోతరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు కలెక్టర్ సోమవారం కలిశారు. పార్వతీపురం ఓ ప్రయివేట్ స్కూల్ లో పదోతరగతి చదివిన యాండ్రాపు హేమశ్రీ, తుమరాడ ప్రణీత 591 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని, ఉరిటి సత్య దినేష్ 588 మార్కులు సాధించి మూడో స్థానంలో సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరిశర్ల రాజేష్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కఠోర దీక్షతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజెఎం పూడి శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణంలో వైసిపి విఫలం

పాలకొండ రూరల్: మండలంలో జంపరకోట రిజర్వాయర్ నిర్మాణంలో అధికార వైసిపి పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు విమర్శించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు నిత్యం రిజర్వాయర్ గురించి మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలకవర్గాలు జంపరకోటను ఎన్నికల కోసం వాడుకుంటున్నాయి తప్ప ఈ ప్రాంత రైతాంగం, అభివృద్ధి పట్ల వారికి చిత్తశుద్ధి లేదన్నారు. రూ.2 కోట్ల అంచనాతో ప్రారంభమైన ప్రాజెక్ట్ రూ.30 కోట్ల అంచనాలు దాటినా పూర్తి కాలేదని, ప్రభుత్వం డబ్బు గుత్తేదార్ల పాలవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టక పోతే రైతాంగంతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జీడిమామిడి రైతులను ఆదుకోవాలి

కురుపాం : అకాలవర్షాలకు నష్టపోయిన జీడి మామిడి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. గత రెండేళ్ల నుంచి జీడిమామిడి రైతులకు సరైన పంట దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారని, ఈ ఏడాది అకాల వర్షాలు, భారీ గాలులు ప్రభావంతో పూతతో ఉన్న జీడిమామిడి తోటలు పూర్తిగా రాలిపోయాయని దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన జీడిమామిడి పంటలను పరిశీలించి బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.



గ్రంథాలయ అభివృద్ధికి నగదును అందజేస్తున్న రాము

గ్రంథాలయానికి శాశ్వత నిధి

బలిజిపేట : గాజువాక డిపోకు చెందిన వేమల సత్యం కుమారుడు వేమల రాము పెదపెంకి నేతాజీ గ్రంథాలయానికి శాశ్వత ఫండ్ నిమిత్తం గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడుకు రూ.5వేలు వేమల రాము అందజేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు రాముకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నంబూరి రాజేష్, రామి శెట్టి శంకర్, నేరల్లా రామకృష్ణ, సంజయ్ దత్, రామి శెట్టి అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానికి సంఘీభావం

సీతంపేట : రాజమండ్రి టిడిపి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి సోమవారం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఎంపి రామ్మోహన్నాయుడును కలిసి సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

పార్వతీపురంరూరల్ : జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జాతీయ కౌన్సిల్ సభ్యులు గంగి శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ అల్లువాడ కిషోర్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఆర్ఎస్ఎన్ మూర్తి, నారాయణరావు, అనంత్, శంకర్రావు, రామారావు, సుధాకర్ రాము, శేఖర్ ,శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

మక్కువ : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సోమవారం ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. పలువురు సర్పంచులు ఆర్థిక సంఘం నిధులపై ఎంపిడిఒను ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు మండలంలోని 17గ్రామాల్లో జగనన్న భూ సర్వే జరుగుతుందని తహశీల్దార్ సూర్యనారాయణ సభకు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి మావు డి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటుకు కలెక్టర్ అంగీకారం

కలెక్టరేట్ : ఉపాధ్యాయ సంఘాలతో కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అంగీకరించారని ఎపి ఎస్‌సి, ఎస్‌టిఉపాధ్యాయసంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఇఒ ప్రేమ్‌కుమార్‌కు సంఘం డైరీలను అందచేసి అభినందనలు తెలిపినట్టు చెప్పారు. టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం ఎంతో అభినందనీయమని సంఘ నాయకులకు, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారని అన్నారు. విద్యాపరంగా జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని, తగిన సూచనలు సలహాలు అందచేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా, యూనియన్లతో కోఆర్డినేషన్ సమావేశం త్వరలోనే ఏర్పాటు చేసేందుకు అంగీకరించారని తెలిపారు.



రక్షణ గోడ నిఅర్మణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రక్షణగోడ నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొండ : తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలో గల కుడి ప్రధాన కాలువ నందు 0.0కెఎం వద్ద నిర్మించనున్న రక్షణ గోడ నిర్మాణానికి సోమవారం రాజాం ఎమ్మెల్యే కె.జోగులు, ఎమ్మెల్సీ వి.విక్రాంత్ శంకుస్థాపన చేయడం జరిగింది. కార్యక్రమంలో వంగర, గరుగుబిల్లి మండలాల ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, జలవనరుల శాఖ నీటి పారుదల డిఇఇ రవి కుమార్, ఎఇఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి, పనుకువలస, బెజ్జి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి పనులు చేపట్టాలని, గిట్టుబాటు కూలి వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేపట్టాలని అన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

కలెక్టరేట్‌లో చిరుధాన్యాల స్టాల్

ప్రజాశక్తి - కలెక్టరేట్


అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం లో భాగంగా చిరు ధాన్యాలకు ప్రాచుర్యం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల (మిల్లెట్) స్టాల్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యాన జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు ఈ స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరు ధాన్యాలకు ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరమున్నదన్నారు. చిరు ధాన్యాల పట్ల ప్రజల్లో అవగాహన ఇంకా పెరగాలన్నారు. చిరు ధాన్యాలు ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిదని చెప్పారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగి మాల్ట్ అందిస్తున్నట్లు సంగతి గుర్తు చేశారు. కొర్రలు, ఆండు కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, రాగులు వంటి చిరు ధాన్యాలు రక్తహీనత నివారణలో సైతం మంచి ఆహారంగా ఉపయోగ పడుతుందన్నారు. పూర్వ కాలంలో ప్రధాన ఆహారంగా ఉండేదని, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు దూరంగా ఉండే వారన్నారు. చిరు ధాన్యాలకు మళ్లీ తిరిగి అవసరం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. చిరు ధాన్యాల వినియోగం ప్రోత్సహించేందుకు, గిరిజనులు పండించే పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి జిల్లా సమాఖ్య ద్వారా విక్రయిస్తున్నట్లు డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్ తెలిపారు. మిల్లెట్ స్టాల్లు అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాశాల అఫిలియేషన్‌కు పక్కాగా పరిశీలన

పార్వతీపురం : రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కళాశాలల అఫిలియేషన్ పునరుద్ధరణకు నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రైవేటు కళాశాలల అఫిలియేషన్ పునరుద్ధరణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుమతులు మంజూరుకు తనిఖీ బృందాలు పత్రాలను పక్కాగా పరిశీలించాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో అఫిలియేషన్ పునరుద్ధరణ మంజూరు చేసేందుకు ప్రైవేట్ కళాశాలలు సమర్పించిన పత్రాలను తనిఖీ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. తనిఖీ చేసిన నివేదికను అఫిలియేషన్ కమిటీకి అందజేయాలన్నారు. కమిటీ నిర్ణయం మేరకు ఇంటర్ బోర్డుకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కళాశాల అఫిలియేషన్ పునరుద్ధరణ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్‌పి వైస్ చైర్మన్, జిల్లా అగ్నిమాపక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి కన్వీనర్‌గా పనిచేయనుంది. తనిఖీ బృందంలో ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ జి. ప్రదీప్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి డాక్టర్ ఓ.దిలీప్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, శ్రీకాకుళం, విజయనగరం ఆర్ఐఒలు ఎస్.తవిటి నాయుడు, ఎం.ఆదినారాయణ, పాల్గొన్నారు.

దేవుడమ్మను సందర్శించుకున్న మంత్రి రోజా

మక్కువ రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి రోజా మండలంలోని పాపయ్య వలసలో గల దేవుడమ్మ ను సోమవారం సందర్శిం చుకున్నారు ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. రోజా ఆకస్మికంగా మండలానికి రావడంతో ఆమెను చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. గతంలో కూడా మంత్రి రోజా దేవుడమ్మని దర్శించుకునే సందర్భం ఉంది ఈ సందర్భంగా ఆమె కోరుకున్న కోరికలు నెరవేరినట్లు ఆ నమ్మకంతో మరల ఇక్కడ దర్శనానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

16 నుంచి స్ప్రేయింగ్

సీతంపేట : ఈనెల 16 నుండి 26 వరకు ఎసిఎం సింథటిక్ పైథారిడ్ స్ప్రేయింగ్ చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహనరావు తెలిపారు. ఈ విషయమై తొలుత ముందుగా డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతికి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. మొదటి విడతలో పూతికవలస, మర్రిపాడు, సీతంపేట, దారపాడు, పెద్దూరు, కిల్లాడ, దేవనాపురం, గుమ్మడ, సామరెల్లి, తదితర పంచాయతీల్లో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



చెరువుకొమ్మువలసలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

చెరువుకొమ్మువలసలో ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాం సమీపంలో గల చెరువుకొమ్మువలసలో సోమవారం ఉదయం నుంచి ఏనుగులు గుంపు సంచరిస్తుంది. ఏ సమయంలో ఏం చేస్తాయో తెలియక స్థానిక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగుల గుంపు తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. తామంతా రైతు కుటుంబాలమేనని, వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని ఎప్పుడూ పొలాల్లో ఉంటామని అటువంటిది పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎటువైపు నుండి ఏనుగులు వచ్చి ఏం చేస్తాయో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తుందని, కావున అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల బారి నుంచి తమ ప్రాణాలను, పంటలను కాపాడి జనజీవనానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నామని తెలిపారు.

ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దళాయివలస, బిత్రపాడు హెల్త్ వెల్నెస్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయన పిహెచ్‌సిలో మందుల, వ్యాక్సిన్ నిల్వలు, ల్యాబ్, వార్డు, ప్రసూతి గది, ఒపి నిర్వహణ, సిబ్బంది హాజరు మొదలగునవి పరిశీలించి వాటి నమోదు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. రోగుల ఆరోగ్య తనిఖీల వివరాలు, పరీక్షలు, వారికి అందజేస్తున్న మందులు, వార్డులో చేరిన రోగులు, అత్యవసర కేసులు, డెలివరీ అయిన గర్భిణీల వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డుల్లో పక్కాగా నమోదు చేసి హెచ్ఎమ్ఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యాధినిరోధక టీకా నిల్వలు, శీతోష్ణ స్థితి పరిశీలించారు. బుధ, శని వారాల్లో టీకా కార్యక్రమం పూర్తైన తర్వాత తీసుకొచ్చే వ్యాక్సిన్లను నిశితంగా పరిశీలించాలని ఫార్మసిస్ట్‌కు సూచించారు. మందుల నిల్వలు, పేర్లు వారీగా ఉంచిన వాటి అమరిక పద్ధతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన వార్డులో చేరి చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం ఆయన హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన ప్రీ పిఎమ్ఎస్ఎ కార్యక్రమం ద్వారా గర్భిణీ ల ఆరోగ్య తనిఖీలను పర్యవేక్షణ చేశారు. మాతా శిశు సంక్షేమ కార్డులను పరిశీలించి వివరాలు ఖచ్చితంగా నమోదు చేసి, హై రిస్క్ గర్భిణీ లను ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీధర్, సూపర్ వైజర్లు పార్వతి, జయగౌడ్, వైద్య సిబ్బంది, సిహెచ్ఒ లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేటలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్ సీతానగరం పిహెచ్‌సి. వైద్యాధికారి పి.ఉషారాణి నిర్వహించారు. గర్భిణీలు అందరికి హీమోగ్లోబిన్, బిపి, షుగర్, చేసి రక్తం తక్కువ ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందజేశారు. అలాగే బిపి, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు అందజేశారు. బాలింతలు, చిన్నపిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల ఆరోగ్య వివరాలు అడిగి వారికి కావాల్సిన మందులు ఇస్తూ జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ప్రజలంతా వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వీరఘట్టం : మండలంలోని నడుకూరులో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి మధుమేహం, రక్తపోటుతో పాటు వివిధ రకాలైన వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, ఎఎన్ఎం సరస్వతి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు కోరారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. మండు వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథలు, నవలలు, పోటీ పరీక్షలు సమాచారం చదవాలని కోరారు. అనంతరం గ్రంథాలయం నిర్వాహకులు డొనక సుకన్య మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించే వేసవి శిబిరాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద్దల చేత కథలు చెప్పుట, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కె.కిషోర్ కుమార్ తదితరులు ఉన్నారు.

కురుపాం : గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 12 వరకు 42 రోజుల పాటు విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు ఎపి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నామని విద్యార్థులకు, యువతకు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని కావున విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులు అందరికీ గ్రంథాలయానికి పంపించి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొండ: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం స్థానిక పెదకాపు వీధి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జామి రవి చేతుల మీదుగా సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ విధానం పరంగా పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడటం కాకుండా గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానపరమైన పరిజ్ఞానం, పుస్తకాలు, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, మట్టితో బొమ్మలు తయారు చేయడం, అల్లికలు నేర్చుకోవడం వల్ల విజ్ఞానంతో పాటు తెలివితేటలు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, యోగా గురువు కె.జనార్ధన్ రావు, తంపటాపల్లి డ్రాయింగ్ మాస్టర్ గొర్లె మురళి, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబు, సహాయకులు ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొండ : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హెచ్ ఎం రవి

నేటి జిల్లా మహాసభలు భవిష్యత్తు రైతాంగ ఉద్యమానికి వేదిక

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఒకప్పటి శ్రీకాకుళం గిరిజన రైతాంగ మహత్తర పోరాటానికి పురిటి గడ్డ పార్వతీపురమని, పోరాట చరిత్ర కలిగిన పార్వతీపురం జిల్లా నలుమూలలు నుండి రైతు ప్రతినిధులతో 2 రోజులు జిల్లా మహాసభలు నిర్వహించుకొవాలనీ భవిష్యత్తు రైతాంగ ఉద్యమానికి వేదికగా ఈ మహాసభలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. ఎపి రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ మహాసభలు సోమవారం ముందుగా స్థానిక మార్కెట్ యార్డు నుంచి లయన్స్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురుబిల్లి అప్పలనాయుడు, ఇవి నాయుడు, చందక కేశవరావులు అధ్యక్ష వర్గంగా నిర్వహించిన రైతు మహాసభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ హాజరయ్యారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

నియోజకవర్గం లోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి అందించారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలివ్వాలని, బొడ్డవలస పంచాయతీ డికె పట్నం ప్రజలకు మంచినీరు సక్రమంగా అందజేశాలని కోరారు. అలాగే సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై శిథిలమైన వంతెన స్థానంలో కొత్తగా నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు తమ ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుతం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వర్షాకాలం రాకముందే వంతెన నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొసరువానివలస వయా డెప్పి వలసకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధి పట్టని వైసిపి

పార్వతీపురం రూరల్ : సంక్షేమ పథకాల పేరుతో గిరిజన గ్రామాల అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. మండలంలోని పెదమరికి పంచాయితీ కొత్త ఊరు, శివం దొర వలసలో సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా చేశారని అన్నారు. తాము అధికారంలో ఉండగా తీసుకువచ్చిన జల జీవన్ పనులు కూడా పూర్తిస్థాయిలో చేయించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గొట్టాపు వెంకట నాయుడు బోను చంద్రమౌళి, మైసర్ల సత్యంనాయుడు , స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ పట్టు చెన్నూరు పంచాయతీ డొంకల వెలగవలస గిరిజనులు సోమవారం మండల తహశీల్దార్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన గిరిజనులు తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తాత, ముత్తాతల కాలం నాటి నుంచి డొంకల, వెలగవలస రెవెన్యూ పరిధిలో గల భూములను సాగు చేస్తున్నామని చెప్పారు. సుమారు 60కుటుంబాలు ఈ భూములు సాగు చేస్తున్నాయని తెలిపారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరకు దీనిపై వినతిపత్రం అందజేశామని, ఫలితం లేదని చెప్పారు. నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చెడ్డ సీతారాం, చెడ్డ రాము, సుందరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొడిస సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కోడిస సచివాలయం పరిధిలో వత్యరాయి గూడ, కురసడు గూడ, కొత్త గూడ, బొర్రవలస, కొంటికర్ర గూడ, బిల్ల గూడ, జమ్మడు గూడ, ఎర్రన్న గూడ, మరియు కోడిస గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపిపిలు విజయలక్ష్మి, సరస్వతి ఎఎంసి చైర్మన్ మోహనరావు, వైసిపి నాయకులు రాము, చంద్రశేఖర్, ఎంపిడిఒ కె.సత్యం, పలువురు అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

పాడిరైతుల సమస్యలపై 12న సదస్సు

పాచిపెంట : పాడి రైతుల సమస్యలపై పార్వతీపురంలోని ఎపిఎన్‌జిఒ హోంలో ఈనెల 12న సదస్సు సదస్సు జరుగుతుందని దీనికి రైతులంతా హాజరు కావాలని పాల సొసైటీ అధ్యక్షులు గంట కృష్ణ తెలిపారు. మండలంలోని కొత్తవలసలో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ పాలు మీదే రైతులు ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్నారని, పశువుల దాణా, మందులు ఇతరత్రా అన్నింటి ధరలు పెరిగాయని, అందుకు అనుగుణంగా పాల ధర పెంచడం లేదని అన్నారు. ఫలితంగా పాల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో పాల రైతుల కష్టాలు తెలుసుకొని తాను అధికారంలోకి వస్తే లీటర్ పాలుకు నాలుగు రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా నేటికీ హామీ నెరవేరలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పాల రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. పాల సొసైటీలను ప్రైవేటుపరం చేయొద్దని పశువులను కొనుక్కునేందుకు పశువులు దాణాకు సబ్సిడీ ఇవ్వాలని, పాల రైతుల సమస్యలు పరిష్కారం చర్చించేందుకు ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురంలోని ఎన్జీ హెూం వద్ద జరగనున్న సదస్సులో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల రైతులు పి.సత్యనారాయణ నాయుడు శేఖరు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య వర్ధంతి

వీరఘట్టం: మండలంలోని దామోదర సంజీవయ్య వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడులో జనసేన నాయకులు ఎం.పుండరీకం, వజ్రగడ జనసేన జానీ దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పనుకువలస కూడలి జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ ఎంవి రమణ కథనం ప్రకారం..



మృతి చెందిన తనుష్య

జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన బొత్స క్రాంతి కుమారి తన కూతురు తనుష్య, కొడుకు దీక్షిత్‌తో కలిసి తమ తాతాగారి ఇంటికి వచ్చారు. చినమేరంగి లో గ్రామ దేవత పండగ నిమిత్తం పిలుపు రావడంతో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తాతయ్య శ్రీరాములునాయుడు, క్రాంతి కుమారి, తనుష్య ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పనుకువలస కూడలి జాతీయ రహదారి వద్దకు చేరుకునేసరికి సాలూరు నుండి వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో బాలిక తనుష్య అక్కడికక్కడే మతి చెందింది. శ్రీరాముల నాయుడుకు. తల్లి క్రాంతి కుమారికి తీవ్ర గాయాలయ్యాయి గాయాలైన ఇరువురికి సాలూరు సిహెచ్ తరలించారు శ్రీరాములనేయుడు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ ను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు జాతీయ రహదారిని నిర్బంధించారు అప్పటికే చేరుకున్న ఎస్ఐ ఎంవి రమణ, సాలూరు సిఐ ధనుంజయ నాయుడు గ్రామస్తులకు నచ్చజెప్పి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్థాపంతో వలసకూలీ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంరూరల్ : పార్వతీపురంలో మూడో రైల్వే లైన్ పనులు నిర్వహించడానికి చత్తీస్‌గడ్ నుంచి వచ్చిన వలసకూలీ కె.సునీత గత కొద్దిరోజులు పార్వతీపురం, బెలగాంలో నివాసముంటు భర్తతో కలిసి రైల్వేపనులు నిర్వహిస్తుంది. అయితే ఆదివారం రాత్రి పుట్టింటి నుంచి ఆమె తల్లిదండ్రులు ఫోన్ చేసి మాట్లాడిన తర్వాత వారితో దూరంగా ఉంటున్నానన్న భావోద్వేగంతో మనస్థాపానికి గురై అందుబాటులో ఇంజెక్షన్లను నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే స్పందించిన ఆమె భర్త జిల్లా అసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేశారు.

పాతకక్షలతో యువకునిపై దాడి

సీతానగరంకు చెందిన సుర వినయ్‌కుమార్‌పై సోమవారం అదే గ్రామానికి చెందిన చింతాడ అనంత్ వర్గీయులు పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని మూకుమ్మడి దాడికి పాల్పడి విజయ్‌కుమార్‌ను గాయపర్చారు. కుటుంబీకులు సీతానగరం పిహెచ్‌సికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం జిల్లా ఆసుపత్రికు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.